క్లుప్తంగా

మహిళల రక్షణకు మరిన్ని చట్టాలు తీసుకురావాలి

ప్రత్తిపాడు రూరల్: మహిళల రక్షణకు మరిన్ని చట్టాలు తీసుకురావాలని అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ నాయకురాలు కాకర రత్నకుమారి డిమాండ్ చేశారు. మండలంలోని చింతలూరు దళిత కాలనీలో శనివారం అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. మరిన్ని చట్టాలను తీసుకువచ్చి వాటిని కఠినంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాస రాజమణి, రాజాలరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో మహిళల ర్యాలీ

ఏలేశ్వరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం మహిళలు ర్యాలీ చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు, బాలాజీ చౌక్ మీదుగా ర్యాలీ సాగింది. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు గండేటి నాగమణి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్, గుమ్మడి పాదాలమ్మ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తుని: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దక్షిణ మధ్య రైల్వే కార్మిక(డీఎంఆర్‌కే) సంఘ తుని కార్యదర్శి, భారత మజ్దూర్ సంఘ(బీఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి వి.కళ్యాణి సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులు, బాధ్యతలను తెలుసుకుని పురుషులతో సమానంగా సమాజంలో వ్యవహరించాలని సూచించారు. మహిళా కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకుని బీఎంఎస్‌లో ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సీతాకుమారి, రైల్వే మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 30 మంది గైర్హాజరు

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షలకు 30 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పరీక్షల చీఫ్ సూపరింటిండెంట్‌లు కె.ఉషామాధురి, కళ్యాణ్ కుమార్ తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 891 మందికి గాను 861 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు వివరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఏలేశ్వరం: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ కె.రత్నాలరావు శనివారం తెలిపారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సి.రాయవరం, రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, జె.అన్నవరం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు సూరంపాలేనికి 'చాగంటి'

గండేపల్లి: మండలంలోని సూరంపాలెంలో ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేసినట్టు వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచె చినబాబు శనివారం తెలిపారు. సూరంపాలెంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద చాగంటి కోటేశ్వరరావు సనాతన ధర్మం ప్రాముఖ్యతపై ప్రవచనం చేస్తారన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వరుపుల
- ఏలేశ్వరంలో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం

ఏలేశ్వరం: పాస్టర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక వేదిక ఫంక్షన్ హాలులో శనివారం కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల (దైవ సేవకులు, క్రైస్తవ నాయకులు) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతబాబు, వరుపుల మాట్లాడుతూ ప్రభుత్వం పాస్టర్ల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పాస్టర్లు అండగా నిలవాలన్నారు. అన్నివర్గాల ప్రజలకూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. తమపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించాలని పాస్టర్లు కోరారు. పాస్టర్ల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తామని అనంతబాబు, వరుపుల హామీ ఇచ్చారు. పాస్టర్ల కమ్యూనిటీ భవనానికి లింగంపర్తిలో పదిసెంట్ల స్థలాన్ని కేటాయించి పాస్టర్లకు పట్టా అందించారు. అనంతరం అనంతబాబు, వరుపులను పాస్టర్లు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యాల సతీష్, వరుపుల సూరిబాబు, ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీలు గొల్లు చినదివాణం, బెహరా రాజరాజేశ్వరి, వాసిరెడ్డి జమీలు, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, అడపా పార్థసారథి, యార్లగడ్డ రాజాచౌదరి, దోనే చిట్టిబాబు, సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

శంఖవరం: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన పేదలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని అచ్చంపేట, ఎస్.జగ్గంపేట, గౌరంపేట, కొంతంగి, మండపం గ్రామాలకు చెందిన 800 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకుని నవరత్న పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ఈగల విజయదుర్గ, బొట్టా చైతన్య, రామిశెట్టి ఏసుబాబు, కూనిశెట్టి మాణిక్యం, దూడల రామస్వామి, సకురు గుర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు యెడ్ల సత్యనారాయణ, కోన బాబ్జి, గింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ వరుపులను సత్కరిస్తున్న పాస్టర్లు

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



ముక్కొల్లులో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ సూచించారు. మండలంలోని భూపాలపట్నం, రామకృష్ణాపురం, ముక్కొల్లు, వేలంక గ్రామాల్లో శనివారం పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ అధ్యక్షతన మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ జోకా శ్రీను, పార్టీ మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్, ధోమాల గంగాధర్, బేరి బాబ్జీ, అరబోలు వాసు, మేడిబోయిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజాను కలసిన చలమయ్య



మంత్రి దాడిశెట్టి రాజాతో చర్చిస్తున్న నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చలమయ్య

తుని: తుని అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు అలమండ చలమయ్య శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. తుని మండలం ఎస్.అన్నవరంలోకి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మూడు మండలాలు, పట్టణ పరిధిలో నాయకుల పనితీరు, సమన్వయం, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం తదితర అంశాలపై చర్చించారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, శ్రీహరిరాజు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ప్రత్తిపాడు: ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై సిబ్బందికి అవగాహన ఉండాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడటం ఎన్నికల అధికారుల బాధ్యత అన్నారు. సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గ మాస్టర్ ట్రైనీలు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రత్తిపాడు, శంఖవరం తహసీల్దార్లు ఎస్.నరసింహరావు, రాజకుమారి, డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావులతో పాటు 471 మంది పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

జగ్గంపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పీఓ, ఏపీఓలుగా విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉపాధ్యాయులకు జగ్గంపేట ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈవీఎంల వినియోగం, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 416 మంది ఉపాధ్యాయులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో రైతులకు శనివారం సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పెద్దాపురం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం విద్యార్థులు రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంటలను ఆశిస్తున్న లద్దెపురుగు, కత్తెర పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎలుకల నివారణలో భాగంగా విషపు ఎర తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు రూపశ్రీ, సాయి. సింధూర, యామిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర రక్షణ దళాల కవాతు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన రాచపల్లి, ఒమ్మంగి, చింతలూరు, ప్రత్తిపాడు గ్రామాల్లో శనివారం కేంద్ర రక్షణ బలగాలతో భారీ కవాతు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్థానిక సీఐ కె.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కల్పిస్తునట్టు చెప్పారు. ఈ కవాతులో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్సైలు ఎం.పవన్ కుమార్, జి.సతీష్ కుమార్, వి.కిషోర్ కుమార్, కేంద్ర బలగాల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఐషర్ వ్యాన్

గండేపల్లి: ఆర్టీసీ బస్సును ఐషర్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... 216వ నంబర్ జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును వెనకే వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొట్టి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలి ఓ మహిళకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది హైవే అంబులెన్స్‌లో ఆమెను జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు: స్థానిక బజారువీధి రామాలయం వద్ద శనివారం నిరుపేద విద్యార్థులకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక షిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చిన పౌష్టికాహార కిట్లను పీఎఫ్ కన్సల్టెంట్ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు అందజేశారు.

జగ్గంపేట: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ రాజపూడి సెక్టార్ సూపర్‌వైజర్ అమ్మాజీ అన్నారు. మండలంలోని రాజపూడిలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ నెల 23వ తేది వరకూ గ్రామాల్లో పోషణ్ పక్వాడా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

తుని: తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో రావికంపాడు సర్పంచ్ మేడిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో కొత్త ఎస్సీకాలనీకి చెందిన పలువురు పార్టీలో చేరారు. వీరికి మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, మంత్రి రాజా నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు.

నేడు మంత్రి రాజా పర్యటన

తొండంగి: మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో ఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎంపీడీఓ పసపులేటి సతీష్ శనివారం తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సాయంత్రం 4 గంటలకు మంత్రి ప్రారంభిస్తారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- సీతంపేటలో గడప గడపకూ..



సీతంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న కో ఆర్డినేటర్ సుబ్బారావు

శంఖవరం: పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని సీతంపేటలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజబాబు, పార్టీ నేతలతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామంలోని 633 మంది పేదలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్ తోట నాగదేవి, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతు అర్జుబాబు, గాబు గంగ, తలపంటి తిరుపతిరావు, తోట కృష్ణ, కోయ్యా జగన్, అడపా సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి వాణి
- సింగరంపాలెంలో ఎన్నికల ప్రచారం



సింగరంపాలెంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న తోట వాణి

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. మండలంలోని సింగరంపాలెంలో శనివారం తోట వాణి, ఆమె కోడలు శ్రీనిధి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతికుటుంబానికీ చేకూరిన లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, గ్రామ సర్పంచ్ బుద్దరాజు గణపతిరాజు, పార్టీ నేతలు కుంచె చినబాబు, సానేపిని తారకం, బి.కిషోర్ వర్మ, వెంకటపతిరాజు, పాలచర్ల వెంకన్నచౌదరి పాల్గొన్నారు.

శంభో శంకర

ప్రత్తిపాడు: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన క్షేత్రంలో శుక్రవారం రాత్రి లింగోద్భవ పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, సహస్ర కుంకుమార్చన, ఆశీర్వచనం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 4.30 గంటల వరకు లింగోద్భవ పూజలు జరిగాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎంవీ రామరాజు వర్మ, రావూరి తాతాజీ, చామర్తి వీరబాబు, కేశవరపు నాగేశ్వరరావు, ఉమాశంకర్ పాల్గొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

మహా శివలింగాన్ని దర్శించుకున్న భక్తులు

ప్రత్తిపాడు ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ శిక్షణాలయంలో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన మహా శివలింగాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. బ్రహ్మకుమారీలు బీకే తులసీ, బీకే శ్రీదేవి మహాశివరాత్రి విశిష్టతను భక్తులకు వివరించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం విశేషాలు, శివపార్వతుల కల్యాణం విశిష్టతను స్వామీజీ భక్తులకు వివరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.